క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

మహబూబాబాద్: వ్యాపారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని జిల్లా తూనికల, కొలతల అధికారి విజయ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కాసం పుల్లయ్య, నీలం ఎలక్ట్రికల్ షాపులను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. కొన్ని బాక్స్‌లపై కంపెనీ పేరు, తేదీ లేని కారణంగా రెండు షాపులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్థలం కేటాయించాలి

డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్‌లో వీధి వ్యాపారులకు స్థలం కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. డోర్నకల్ కూరగాయల మార్కెట్ పరిధిలో 53 మంది వ్యాపారులు ఉండగా కొంతకాలం క్రితం చేపట్టిన మార్కెట్ భవన నిర్మాణ పనులు నిలిచిపోవడంతో చాలా మంది చిరు వ్యాపారులు రోడ్ల పక్కన తోపుడు బండ్లు, కూరగాయల దుకాణాలను ఏర్పాటు చేసుకొని ఎండ, వానలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

సర్వే రెమ్యునరేషన్ చెల్లించాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో ఉపాధ్యాయులు చేపట్టిన కులగణన సర్వే విధులు నిర్వహించిన వారికి రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్ అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో సోమవారం టీపీటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, కొరవి మండల ప్రధాన కార్యదర్శులు సారెడ్డి లింగారెడ్డి, ఓదెల శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రఘునందన్‌రావును కలిసిన నాయకులు



మహబూబాబాద్ అర్బన్: బీజేపీ రాష్ట్ర నాయకుడు, మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావును మానుకోట బీజేపీ జిల్లా అధ్యక్షులుగా వల్లభూ వెంకటేశ్వర్లు నూతనంగా నియామకమైన సందర్భంగా సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు ఒద్దిరాజు రామచంద్రరావు, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ సతీష్, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బండారు శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈమేరకు సోమవారం కేసముద్రం ఫొటో, వీడియో గ్రాఫర్స్ కమిటీ ఆధ్వర్యంలో బాధితుడికి రూ.17,500ల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అనుమాస కుమార్, షేక్ అబ్జల్, బుర్ర నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం ఇంకెప్పుడు?

- శిలాఫలకాలకే పరిమితం
- పట్టించుకోని పాలకులు
- వర్షాకాలంలో పాకాల ఏరు దాటాలంటే ఇబ్బంది పడుతున్న ప్రజలు



చెక్‌డ్యాం పైనుంచి ప్రవహిస్తున్న పాకాల ఏరు (ఫైల్)

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కేవలం శిలాఫలకాలు, కాగితాలు, సర్వేలకే పరిమితమైందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రూ.15కోట్ల నిధులు మంజూరు చేయించారు. అప్పటి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్‌లచే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పాకాల ఏటి బ్రిడ్జి నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా తయారైంది. దీంతో ప్రతీ ఏటా వర్షాకాలంలో పాకాల ఏరు 3నెలల పాటు చెక్‌డ్యాం పైనుంచి పొంగి ప్రవహిస్తుండడంతో రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల ప్రజలు, పాఠశాల విద్యార్థులు మండల కేంద్రమైన గార్లకు రాలేక బయ్యారం, డోర్నకల్ మండలాల మీదుగా చుట్టూ తిరిగి వస్తూ నానా ఇబ్బందులు పడుతుంటారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

- సీఐ జి.సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న సీఐ సూర్యప్రకాష్

గూడూరు: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని సీఐ జి.సూర్యప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఇటీవల కొందరు గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారం ఉందన్నారు. ఈక్రమంలో ఆదివారం గూడూరు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్లే జాతీయ రహదారిపై మట్టివాడ క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు గూడూరుకు చెందిన మేడ సుజిత్, పొనుగోడుకు చెందిన భూక్య మనేష్‌లు ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారని, వారి వాహనం నిలిపి తనిఖీ చేయగా 5కిలోల 440 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. వెంటనే వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ జరిపామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి అక్రమంగా పట్టుకొచ్చి, మహబూబాబాద్‌లో విక్రయించడానికి వెళ్తూ పట్టుబడ్డారన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి విలువ రూ.2,72,000లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఏఎస్సై బిచ్చానాయక్, కానిస్టేబుళ్లు రాజేష్, ప్రణీత్, అమృ, సుధాకర్ పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాలవంచ మామునూరు ఎయిర్‌పోర్టుకు రూ.495కోట్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రంలో ముత్యాలమ్మగుడి సెంటర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్, రూరల్ అధ్యక్షుడు బానోత్ జహిందర్, నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రధాని మోదీకి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్ శర్మ, నాయకులు అశోక్, లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్, మురళీ, ఇందుభారతి, పద్మావతి, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతిరావుపూలే సెంటర్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేశ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిల నర్సింహరెడ్డి, కోశాధికారి గాంతి వెంకట్ రెడ్డి, బోగోజు నాగేశ్వరాచారి, బోనగిరి ఉపేందర్ పాల్గొన్నారు.

అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

బయ్యారం: అణిచివేతకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ, రాష్ట్ర నాయకురాలు తుడుం అనురాధ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని బయ్యారం, గంధంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలను ఉద్దేశించి వారు మాట్లాడారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో మహిళలపై దాడులు జరుగుతున్న పాలకులు సరైన చర్యలు తీసుకోవటంలో విఫలమవుతున్నారన్నారు. కార్యక్రమంలో భారతమ్మ, రేణుక, రత్నం, వెంకటమ్మ, జగతి, జీవిత, తదితరులు పాల్గొన్నారు.

తునికాకు టెండర్లు పూర్తి చేయాలి



బయ్యారం: ఆందోళన చేస్తున్న నాయకులు

బయ్యారం: ఆదివాసీ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించే తునికాకు సేకరణ నిమిత్తం టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సోమవారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 50 ఆకుల కట్టకు ఆరు రూపాయలు చెల్లించాలన్నారు. అనంతరం అటవీశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీకృష్ణ, యాకన్న, వెంకన్న, లింగమల్లు, ఐలయ్య, భగవాన్, వీరభద్రం, భీముడు, శ్రీను, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడ: తునికాకు యూనిట్లకు టెండర్లు వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ నాయకులు సోమవారం మండల కేంద్రంలోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో వినతిపత్రం అంద చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, యాదగిరి యుగేందర్, మంగన్న, శ్రీశైలం పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారి నర్సింహరావు

కురవి: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, నేరడలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. వంటగదలను, భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బాలికలకు సూచించారు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలుర పాఠశాలలో..



పెద్దవంగర: చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



మహబూబాబాద్ అర్బన్: కంకరబోర్డు జెడ్పీహెచ్ఎస్‌లో..



గూడూరు: బాలుర హైస్కూల్‌లో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, కంకరబోర్డు జెడ్పీహెచ్ఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం సిరినాయక్, ఉపాధ్యాయులు వాసుదేవ్, రవీందర్ నాయక్, షరిరాం, భరత్‌వ్యాస్ పాల్గొన్నారు. కంకరబోర్డు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం మాలోతు కోట్యానాయక్, ఉపాధ్యాయులు ఉమాదేవి, సునీత, భిక్షం పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం బహుమతులు అందించినట్లు హెచ్ఎం బి.సదాశివ తెలిపారు.

పెద్దవంగర: మండలంలోని చిట్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎర్రోజు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు రమేశ్, కోటేశ్వర్, సురేందర్, యాకన్న పాల్గొన్నారు.

పని నేర్చుకొమ్మన్నందుకు..

- ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: పని చేయడం నేర్చుకోమని భర్త అన్నందుకు భార్య క్షణికావేశానికిలోనై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిషా రాష్ట్రంలోని కందమల్ జిల్లా దరింబాది తాలూకా స్రంబాద్ గ్రామం కేరుబడి పోస్ట్ ప్రాంతానికి చెందిన ప్రద్యుం మాలిక్ రెండో కుమార్తె చంద్రమ మాలిక్ (22) జాజపూర్ జిల్లా మంగలపూర్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ దాస్‌ను గత ఏడాది డిసెంబర్ 23న ప్రేమించి పెళ్లి చేసుకుంది. వారిద్దరు కలిసి జిల్లా కేంద్రంలోని ఆర్తిగార్డెన్ సమీపంలో నివాసం ఉంటూ ప్లాస్టిక్ సామానుల కంపెనీలో కార్మికులుగా పని చేస్తున్నారు. చంద్రమ మాలిక్ ఇంట్లో ఏమి పని చేయట్లేదని అల్లుడు అనిల్ కుమార్ దాస్ తన మామ ప్రద్యుం మాలిక్‌కు చెప్పాడు. దీంతో పని చేసుకొమ్మని తండ్రి, కూతురితో అన్నాడు. ఇందుకు సరే అని చెప్పిన ఆమె ఇంట్లో ఏం పని చేయకపోవడంతో భర్త పని చేయడం నేర్చుకో అన్నందుకు ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త పనికి వెళ్లిన వెంటనే క్షణికావేశంలో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై అలీం హుస్సేన్ శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు.

మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి



మిర్చిని పరిశీలిస్తున్న నాయకులు

గార్ల: మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి పంట క్వింటాకు రూ.25వేల మద్దతు ధర పెట్టి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా హరినాయక్ డిమాండ్ చేశాడు. సోమవారం మండలంలోని ముత్తితండా, కోట్యానాయక్‌తండాలో ఆయన మిర్చిపంట కల్లాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం మిర్చిపంటకు మార్కెట్‌లో క్వింటాకు రూ.12వేలు మాత్రమే ధర చెల్లిస్తుండంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మద్ధతు ధర చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీను, ధరావత్ వెంకన్న, ఇస్లావత్ మంగీలాల్, వెంకన్న, రవి, బిక్కు, సక్కు, రూప్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉద్యమకారులకు స్థలం ఇవ్వాలి

మహబూబాబాద్: ఉద్యమకారులకు 250గజాల స్థలం ఇవ్వాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు దార్ల శివరాజ్, అహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ



గార్ల: గార్లలోని బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు డీఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు శాంతికుమార్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయికుమార్, సూర్యప్రకాష్, తరుణ్, హెచ్ఎం సుందర్‌కుమార్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం ఎస్సీ కాలనీలో విధులు నిర్వహిస్తున్న కొమ్ము యాదమ్మపై, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, చాగంటి కిషన్ డిమాండ్ చేశారు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్మికురాలిపై దాడిచేసిన వారిపై చట్టపరంగా చర్య తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగారపు యాకమ్మ, కుమారస్వామి, రాజు, శంకర్ పాల్గొన్నారు.

వరి బోనస్ డబ్బులు చెల్లించాలి

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం వరి బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నాకు దిగారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, సారంగం, రాజు, నాగేశ్వర్‌రావు, అంజయ్య పాల్గొన్నారు.

విరాళాల అందజేత

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన గవర్నమెంట్ ఉద్యోగి జక్కి నగేష్, బత్తెం రమేష్ రూ.10వేల చొప్పున అందించగా, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి రూ.5వేలు విరాళంగా యాదవ సంఘం కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చిత్తారి వీరన్న, కొమ్ము మల్లయ్య, బొల్లు వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

సాగునీరు అందించాలి

నెల్లికుదురు: జిల్లా కేంద్రంతోపాటు నెల్లికుదురు మండలంలోని రైతులకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ ఇన్ చీఫ్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. నెల్లికుదురు మండలానికి మరో ముగ్గురు ఏఈలను కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

డోర్నకల్: యువత చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గంధసిరి శ్రీనివాస్ తెలిపాడు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో సోమవారం కబడ్డీ క్రీడాకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు కొడవండ్ల యాదగిరి, భీమనబోయిన సాగర్, గట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయాలి

మహబూబాబాద్: ఎస్సారెస్పీ జలాలు విడుదల చేసి చిన్న గూడూరు మండలంలోని అన్ని చెరువులను నింపాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చందులాల్, సేవాలాల్ సేన నాయకుడు సురేష్ జిల్లా కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

నెల్లికుదురు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 5నుంచి 25 వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ కె.రాజు, ఎస్సై చిర్ర రమేష్ బాబు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌తో కలిసి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా కళాశాలలోని పరీక్ష కేంద్రాల్లో గాలి, వెలుతురు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద 104 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

లారీ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఓ వృద్ధురాలిని లారీ ఢీకొన్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన డొనికని సుభద్ర పనిపై మండల కేంద్రానికి వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుంది. ఈక్రమంలో తొర్రూరు నుంచి ఖమ్మం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. సుభద్రకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు 108వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

సహరికి ఏర్పాట్లు

డోర్నకల్: రంజాన్ ఉపవాస దీక్షలు ఆచరించే వారి కోసం స్థానిక ఉస్మానియా మసీదులో ఏర్పాట్లు చేశారు. ఉపవాస దీక్షలు ఆచరించే వారి కోసం అల్నూర్ యూత్ ఆధ్వర్యంలో మసీదులో ప్రతీ రోజూ తెల్లవారుజామున ఆహారం సిద్ధం చేస్తున్నారు. ఉపవాసం ఉండే వారు మసీదులో ఏర్పాటు చేస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేషీ ఇమాం ఎండీ సుల్తాన్ కోరారు.

క్రైం కార్నర్..

అపార్ట్‌మెంట్ నిర్మాణ పంచాయితీ.. పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదులు

మహబూబాబాద్ రూరల్: అపార్ట్ మెంట్ నిర్మాణ విషయంలో తలెత్తిన వివాదాల కారణంగా పంచాయితీ జరిగి, అందుకు సంబంధించిన ఇరువర్గాల వారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న గార్లపాటి సింగారెడ్డి స్థానిక నంది నగర్ ప్రాంతంలో అంజన రెసిడెన్సీ నిర్మాణం కోసం రూ.1.35 కోట్లను బిల్డరు శివారెడ్డికి ఇవ్వగా సదరు బిల్డర్ ఆ భవన నిర్మాణం పూర్తి చేయకుండా వెళ్లిపోయాడు. బిల్డరు శివారెడ్డికి స్థానిక నివాసితుడు వెంకటేశ్వరరావు కొంత డబ్బును అప్పుగా ఇచ్చిన క్రమంలో అతడు వెళ్లిపోయిన విషయాన్ని తెలుసుకున్నాడు. దీంతో శివారెడ్డి తీసుకున్న డబ్బులు తనకు ఇవ్వాలని సింగారెడ్డిపై వెంకటేశ్వరరావు ఒత్తిడి తీసుకువస్తున్నాడు. డబ్బులు ఇవ్వాలని వెంకటేశ్వరరావుకు సంబంధించిన పలువురు వ్యక్తులు ఆదివారం రాత్రి సింగారెడ్డిపై దాడిచేసి హత్యాప్రయత్నం చేశారు. దీంతో జరిగిన ఘటనపై బాధితుడు సింగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంకటేశ్వరరావుకు కూడా ఫిర్యాదు ఇచ్చారు. ఈ విషయమై టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్‌ను వివరణ కోరగా ఇరువర్గాలు ఫిర్యాదులు ఇచ్చారని, విచారణ జరుపుతున్నామని తెలిపారు.

సౌండ్ తగ్గించమన్నందుకు దాడి

కొత్తగూడ: ఇంట్లో సౌండ్ బాక్సులతో ఇబ్బంది అవుతుంది, సౌండ్ తగ్గించమన్న మహిళపై దాడి చేసిన సంఘటన మండలంలోని గోవిందాపురంలో జరిగింది. ఎస్సై కుశకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తాటి కృష్ణ ఇంట్లో సౌండ్ బాక్సులతో ఇబ్బంది అవుతుందని పాయం యశోద సౌండ్ తగ్గించమని అడిగినందుకు కృష్ణతోపాటు సన్ని, కాంతమ్మలు కర్రలతో యశోదపై దాడికి దిగారు. యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరిపై కేసు నమోదు

కొత్తగూడ: అలాగే సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుశకుమార్ తెలిపారు. కోనాపురం గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపులో కర్ర జనార్దన్ రెడ్డిపై అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వెంకటేశ్వర్లు, పెద్దిరెడ్డి అనిల్‌రెడ్డిలు వ్యక్తగత దూషణలకు పాల్పడ్డారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మానుకోటలో వివాహిత కిడ్నాప్

మహబూబాబాద్ రూరల్: ఓ వివాహిత కిడ్నాప్ అయిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో రాజస్థాన్ రాష్ట్రంలోని బిల్వాడ జిల్లా భీమిడియాస్ గ్రామానికి చెందిన రాజీవ్ మూడేళ్లుగా నివాసం ఉంటున్నాడు. చెరకు రసం బండ్లు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునే రాజీవ్ తమ ప్రాంతానికి చెందిన సుమన్ అనే మహిళను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఆమె మేనమామ రాజు, మరికొంతమంది వచ్చి తోటి కోడలు మేనను కట్టివేసి ఘర్షణకు దిగి సుమన్‌ను తమ వెంట కారులో తీసుకుని వెళ్లిపోయారు. రాజీవ్ డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం బ్లూకోల్ట్స్ పీసీలు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. జరిగిన సంఘటనపై బాధితులు మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రాజీవ్ నగర్ కాలనీలో చోరీ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో నివాసం ఉండే బెడద రామలక్ష్మి ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. రామలక్ష్మి కుటుంబ సభ్యులు వేములవాడకు దైవదర్శనార్థం రెండు రోజుల క్రితం వెళ్లి సోమవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంట్లోని బీరువాలో తులం బంగారు ఆభరణాలు చోరీకి గురికాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ ఎస్సై శివ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు.

ఆలయాల్లో చోరీ

దంతాలపల్లి: మండలంలోని దాట్ల గ్రామంలో రెండు ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు హుండీలను ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని యాదవుల ఆరాధ్య దైవం గంగమ్మ తల్లి ఆలయంలో హుండీ ఎత్తుకెళ్లారు. అలాగే పెద్దమ్మ తల్లి ఆలయంలో హుండీని పగలకొట్టి అందులో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. చోరీపై గ్రామానికి చెందిన పంజా భిక్షం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

పరామర్శ..

కురవి: హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్ద తండా గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుగులోత్ విజయ్ కుమారుడు గోవింద్(30) మృతి చెందాడు. మృతుడు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు మేనల్లుడు కావడంతో సోమవారం అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పెద్దవంగర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామానికి చెందిన తాటిపాముల శ్రీనివాస్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా ఉమ్మడి వరంగల్ మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు సాకారంతో సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50కేజీల బియ్యం అందజేశాడు.